# కొత్త కెరటం



శ్రీరాజ్

"రజనీ! నే నేదైనా తప్పు చేశానా?"

అతని మాటలకి పెరట్లో బావిదగ్గర నీళ్లు తోడుతున్న రజని అటు తిరిగి చూసింది. రామం స్నానం చేయటానికి సబ్బూ, తువ్వాలూ తీసుకొని వచ్చాడు. రజనీ మాట్లాడలేదు.

"చెప్పు రజనీ! నాలుగు రోజుల్నుండి ఎందుకు తప్పించుకుంటున్నావు? ఉత్తరంలో అసభ్యంగా రాశానా?"

రజనీ తల వంచుకుంది. మౌనంగా బిందె చంకలోకి తీసుకొని నడవబోయింది. ఆమెకు దారి యివ్వకుండా రామం చేత్తో అడ్డుపెట్టాడు.

"రజనీ! నీకు ఏ రకంగానైనా నేను బాధ కలిగిస్తే, నన్ను క్షమించు. కానీ, నన్ను బాధపెట్టకు. ఇలా నన్ను దూరం చేస్తూ నువ్వు దూరం కావడానికి ప్రయత్నించకు ప్లీజ్...."

అతను రజనీ కళ్ళలోకి సూటిగా చూస్తున్నాడు. చిన్న గాలి తాకిడికి ఆమె పొడుగాటి శిరోజాలు అటూ యిటూ కదులుతున్నాయి. చెట్ల సందుల్లోనుండి దూసుకు వస్తున్న లేత కిరణాల వెలుగులు ఆమె ముఖంమీద అక్కడక్కడ పడి నీరసించిపోయిన ఆమె కళ్ళలో ఎర్ర చారల్ని చూపిస్తున్నాయి.

రజనీకి గుండె బరువెక్కి, కన్నీళ్లు వచ్చాయి. తనకీ, రామంకీ మధ్య ఓ లక్ష్మణరేఖ గీయబడింది. ఆ గీతకి రెండు వేపులా దూరం పెరుగుతుంది. తనకోసం ప్రతి క్షణం ఆరాటపడే రామాన్ని కలుసుకొని, తన అసహాయతని తెలియజేయాలని, తనని మరచిపోయి, మనసారా క్షమించమని అడగాలని ఉంది. కానీ, ప్రతి క్షణమూ అత్తయ్య చూపులు నీడలా వెంటాడుతున్నాయి. తనకి ప్రేమించడం తెలిసిందే గాని ఎదురుదెబ్బలకి నిలిచి తట్టుకొనే ధైర్యం గాని, వయస్సుగాని తనకి లేవు.

రామం అన్ని ప్రశ్నలకీ ఒకటే సమాధానం అన్నట్లు రజని కళ్ళలో సుళ్లు తిరుగుతున్న నీళ్లు జలజలా కిందికి జారాయి.

అతను చేసేది లేక, అడ్డు తప్పుకున్నాడు. రజనీ వడివడిగా అక్కడి నుండి వెళ్లిపోయింది. ఆమె వెళ్లిన వేపే చూస్తూ కొన్ని క్షణాలు అలాగే వుండిపోయాడు.

నిన్న మొన్నటి వరకు రజనీ తనతో ఎంతో స్నేహంగా ఉండేది. సరదాగా ఎన్నో కబుర్లు చెప్పేది. కళ్ళతో సైగలు చేసేది. తను సాయంకాలం ఆఫీసు నుండి తిరిగి రూంకి వచ్చేవరకు వాళ్ళ గడప దగ్గర కూర్చొని, చదువుకుంటూ తన రాకకోసం ఎదురుచూసేది. తను ఆలస్యంగా వచ్చినా, తొందరగావచ్చినా ఆమె కళ్ళలో భావాన్ని బట్టి ఆ రోజు ఆమె తనమీద కోపంగా ఉందో, ప్రేమగా ఉందో యిట్టే తెలిసేది. వాళ్ళ అత్తయ్య చూడకుండా తన గదిలోకి వచ్చి, అలారం చెవిలో వినిపించి, అల్లరి చేసి తనను నిద్రలేపేది. వాళ్లింట్లో చేసుకునే టిఫిన్లూ, కూరలూ తీసుకొచ్చి తనచేత కొసరి కొసరి తినిపించేది. తను తినకుండా అల్లరి చేస్తే, ఆమె వెక్కిరించేది. అప్పుడప్పుడు ఆమె చిన్న

గుండెలో ఎంతో ప్రేమ ఉందని తనకి ఉత్తరాలు రాసేది. ఎన్నెన్నో మధురానుభూతులు. ఆకలి, దప్పిక తెలియని క్షణాలు.

ఇప్పుడు రజనిలో ఓ విభిన్న వ్యక్తి కనిపిస్తుంది. ఎంతో మార్పు. క్షణక్షణం తనని రంపపు కోత పెడుతున్న ఆ మార్పు ఆమెలో ఎందుకు వచ్చినట్లు? ఆమెలో నైరాశ్యానికి మౌనానికి తల పగులగొట్టుకొని ఆలోచిస్తున్నప్పటికీ—కారణాలు అతను ఊహించలేక విఫలుడై పోతున్నాడు.

డ్రస్ చేసుకొని, అద్దం ముందు నిలబడి తల దువ్వుకుంటున్న రామంకి—బయట గేటు దగ్గరవేసి, కాలేజీకి వెళ్తున్న రజని కనిపించింది. గబగబా తలుపు తోసుకొని, వరండా మీదికి వచ్చి 'రజనీ' అని పిలిచాడు. రజినీతో కలిసి వెళ్ళి, విషయం ఏమిటో తెలుసుకోవాలని అతను తొందర పడుతున్నాడు. నిశ్చలంగా ఉన్న మనసు చెల్లాచెదరై కల్లోలితమైతే ఎంత బాధగా ఉంటుంది? రజని వెనక్కి తిరిగింది. అంతలోనే భయపడి, చూపు మరల్చుకొని ముందుకు సాగింది.

రామం ప్రక్కకి తిరిగి చూశాడు.

వరండాలో ద్వారం పట్టుకొని గంభీరంగా తననీని, రజనీ మార్చి మార్చి చూస్తున్న సరస్వతి కనిపించింది. ఆమెను చూడగానే రజనీ నిర్లిప్తతకి కారణం కొంత అవగాహన అయింది, రామంకి. తలవంచుకొని, తన రూంలోకి వెళ్ళిపోయాడు.

ఆ రోజు రాత్రి భోజనం చేశాక తనతో మాట్లాడానికి ఒకసారి రమ్మని సరస్వతి రామంతో చెప్పింది.

ఎనిమిది గంటలు వినిపించాయి. తనికీ రజనీకి మధ్య ఉన్న పరిచయం సరస్వతి పసిగట్టిందనే విషయం ఉదయాన్నే తెలిసింది, రామంకి. అప్పట్నుంచి అతని మనసులో చికాకు చోటు చేసుకుంది. ఆఫీసులో ఫైళ్ళు చూడబుద్ధి కాలేదు. భోజనం కూడా చేయాలనిపించలేదు. అస్తవ్యస్తమైన ఆలోచనలతో తల వేడెక్కి—పోతుంది.

రామం గదిలోకి రాగానే, అక్కడే కూర్చొని చదువుకుంటున్న రజనీ మౌనంగా లేచి వంటగదిలోకి వెళ్ళిపోయింది.

సరస్వతి పిల్లల పేపర్లు ముందేసుకొని దిద్దుతుంది. రామాన్ని చూడగానే పేపర్లు ప్రక్కకు పెట్టి, కూర్చోమని కుర్చీ చూపించింది.

"మీరు చదువుకున్నవారు, ఉద్యోగం చేస్తున్నారు. లోకజ్ఞానం తెలిసినవారు. మరి, రజనీ?.... చదువుకుంటుంది. అన్నెం పున్నెం ఎరుగని పసిపిల్ల. చెప్తేగాని 'మంచీ చెడ్డా' గుర్తించలేని వయసు దానిది. అది తొందర పడితే, మీరు మందలించాలి. అంతేకాని...." సరస్వతి మెత్తగా అతనికి చీవాట్లు వేయబోతుంటే, మధ్యలోనే రామం—ఆమె మాటను త్రుంచేశాడు.

"క్షమించండి. నేను రజనీని పెళ్ళి చేసుకుంటాను."

సరస్వతి అతని ముఖంలోకి తీక్షణంగా చూసింది. ఆమెలో ఉక్రోషం లాంటిది ఏదో పొడుచుకొచ్చింది.

"అవునండీ....దాన్ని మీరు పెళ్ళిచేసుకుంటారు. నాకు ఉన్న ఆ కాస్త తోడును మీరు దూరం చేస్తారు. నేను గుండె పగిలి చస్తాను."

"మీరు అవేశపడుతున్నారు....మీ రజనీకి పెళ్ళి చెయ్యరా?"

"చేస్తాను. నా బాధ్యతలు ఒకరు గుర్తుచెయ్యనవసరం లేదు."

"చూడండీ! నేను రజనీని ప్రేమిస్తున్నాను. మీకు యిష్టం ఉన్న రోజున పెళ్ళిచేసుకుంటాను. అంతవరకు నేను వేచిఉంటాను."

"మీ పిచ్చి మాటలతో దాని మనసుని పాడుచేయకండి. అది అభివృద్ధిలోకి రావలసిన పిల్ల. మీ స్వార్థంతో దాని భవిష్యత్తును, నా వెలుగును పాడుచేయకండి, మీకు చేతులెత్తుతాను." సరస్వతి మాటల్లో జీర వినిపిస్తుంది.

కాసేపటికి తేరుకొని, మళ్ళీ ఆమే మాట్లాడింది.

"రామంగారూ! దయచేసి—నా అవేదన మీకు సరిగ్గా చెప్పలేకపోవచ్చు, కానీ నన్నర్థంచేసుకొండి. మా రజనీని మరచిపొండి. దాంతో మీ చనువును సహించను. నా మాటను తోసిపుచ్చితే, మా రజనీకి నేను మిగల్ను."

సరస్వతి మాటలకు అతను ఉలికిపడ్డాడు. నేరం లేని శిక్ష యిది. ఆమె ఎవర్నీ మాట్లాడనివ్వడంలేదు. ఆమె అన్నీ మాట్లాడేస్తుంది. హెచ్చరించింది. శాసించింది. బతిమాలింది. ప్రాధేయపడింది. ఆమె మాటలకి రామం ముఖం నిస్తేజమైపోయింది. భారంగా లేచి అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

సరస్వతి రజనీని పిలిచింది.

"వద్దు పిల్లా.... వద్దు. ఇలాంటి తొందర పనులు చేసి, నాకూ మీ వాళ్ళ తలవంపులు తీసుకు రావొద్దు. గుట్టుగా బతుకుతున్నవాళ్ళని బయట కీడ్చకు. నా శిక్షణలో పెరిగిన పిల్లవి. ఎంతో లక్షణంగా నిన్ను ఉంచానన్న తృప్తి నాకు మిగల్నియ్." ఆమె వల వల ఏడ్చింది.

అత్తయ్యంటే మొదట్నుంచీ రజనీకి భయం. ఎప్పుడూ ఆమెకి ఎదురుగా నిలిచి, సూటిగా చూస్తూ మాట్లాడలేదు. అంతరాంతరాల్లో ఏదో వణుకు పుడుతుంది. అయినా ఆ రోజు అత్తయ్యతో వాదించి ఓడిపోయింది. అప్పట్నుంచి ఆమె జీవచ్ఛవంగా మారిపోయింది

అందుకే అత్తయ్య మాటలకి సమాధానం యివ్వలేదు రజనీ.

* * *

ఈ సంఘటన జరిగిన తర్వాత ఒక రోజు సాయంత్రం రామం–సరస్వతిని కలుసుకొని, గది తాళంచెవి యిచ్చాడు.

"ఏంవిటిది?...." సరస్వతి ఆశ్చర్యంగా చూసింది.

"నేను గది ఖాళీ చేస్తున్నాను." అతను మామూలుగా సమాధానం యిచ్చాడు.

"మీకు యిబ్బందిగా ఉంటుందా?"

"లేదు. కానీ, ప్రతిక్షణం పాత జ్ఞాపకాలు బాధపెడ్తున్నాయి. దూరంగా ఉంటే, కొందరి భవిష్యత్తు బావుండొచ్చు."

"నా మాటను దెప్పిపొడుస్తున్నారు కదూ?"

"అబ్బే, లేదండీ!"

సరస్వతి చిన్నపిల్లలా ఏడ్చేసింది.

"రామం గారూ! ఈయిల్లో ఉన్నది యిద్దరూ ఆడవాళ్లమే అయినా మగదిక్కు లేదని నేనెప్పుడూ బాధపడలేదు. మీరు మా మనిషని మా కష్టసుఖాల్ని మీతో చెప్పుకుంటున్నాను. మమ్మల్ని అర్థం చేసుకున్నారని మా యింటి బాధ్యతలు మీకు అప్పగిస్తున్నాను......."

రామం మాట్లాడలేదు.

క్రింద ఉండే సరస్వతి ప్రక్కవాటాను అద్దెకిచ్చింది. మొదట్నుంచి రామమే ఆ వాటాలో ఉంటున్నాడు. ఆ వాటా అద్దెకిచ్చినట్లుగా గాని, అందులో ఎవరో అద్దెకుంటున్నట్లుగాని ఆమె ఆలోచించలేదు.

"మీరు వెళ్లిపోతే, ఆ వాటా ఎవరికో మళ్లీ అద్దెకిస్తానని అనుకున్నారా?.... లేదు. ఎవరికీ యివ్వను. కాకపోతే, ఆర్థికంగా మేమే యిబ్బంది పడాలి. అయితే, ఏం. మళ్లీ ఎవరితోనో పరిచయం పెంచుకోవడం, ఆ ఎవరో మీలాగే అర్ధాంతరంగా వెళ్లిపోవటం– యివన్నీ జరగవు."

సరస్వతి కళ్ళు తుడుచుకుంది. ఆమె మనస్తత్వం చాలా చిత్రమైనది. తను అనుకున్నది జరిగితే ఆమె మనసు కుదుటపడుతుంది. తనూహించిన దానికి భిన్నంగా ఏది జరిగినా, ఆమె సహించలేదు. రామం ఆ వాటాలో ఉండటం ఆమె కెంతో యిష్టం. అయితే 'ప్రేమా పిచ్చి' అంటూ రజనీని దూరంచేయటం ఒప్పుకోలేదు.

ఆమెను ఎలా ఓదార్చాలో, ఆమెతో ఎలా మాట్లాడాలో రామంకి తెలియలేదు. స్తబ్దుగా ఉండిపోయాడు.

"రామంగారూ!....దయచేసి మీరు వెళ్ళకండి. మీరు ఎదిగారు.. మనసుని అదుపులో పెట్టుకోవడం వయస్సూ, అనుభవమూ నేర్పుతాయి. మనసుని అదుపులో ఉంచుకుంటే ఎలాంటి విషయాన్నయినా మరచిపోగలం. ప్లీజ్.... ఈ ఊళ్లో ఉద్యోగం చేస్తున్నంత కాలం మీరు ఎక్కడికీ వెళ్లొద్దు. ఈ వాటాలోనే ఉండండి. మాకు సాయంగా ఉండమని కోరుతున్నాను. కాదనకండి" ఆమెలో యిప్పుడు అమాయకమైన పసిపాప వేడుకోలు వినిపిస్తుంది.

రామం మౌనంగా తాళం తీసుకొని, తన గదిలోకి వెళ్లిపోయాడు. రజనీతో మాట్లాడకూడదు. ఆ వాటా విడిచి వెళ్లకూడదు. పాత స్మృతులు కళ్ళ ముందు కదులుతున్నప్పటికీ గతాన్ని పూడ్చిపెట్టుకుంటూ, జీవితాన్ని నెట్టుకుంటూ రావాలి. అయోమయ పరిస్థితి. మనసుని తన అదుపులో ఉంచగలడా? ఏమో? ఈ కథ ఏ ముగింపుకి దారితీస్తుందో? గదిలోకి చేరుకున్న రామం గట్టిగా కళ్ళు మూసుకొని, కళ్ళముందు చీకటి తెరల్ని చూస్తూ ఉండిపోయాడు.

యాంత్రికంగా రోజులు దొర్లిపోతున్నాయి.

ఒకప్పుడు చాలా దగ్గరగా ఒకటిగా మసలిన రామం, రజనీ ఒకరికొకరు ఎప్పుడూ పరిచయంలేని వ్యక్తుల్లా ముభావంగా తిరుగుతున్నారు. రామం ఎదుటపడితే రజనీ వెంటనే తప్పుకుంటుంది. ఆమె పెరట్లో పనిచేస్తున్నంత సేపు అతను ఆ ఛాయలకే వెళ్లడు. సాధ్యమైనంత ఆలస్యంగా అతను ఆఫీసునుండి వస్తాడు. అవసరం ఉన్నా లేకపోయినా తొందరగా ఇల్లు విడిచిపెట్టడానికి ప్రయత్నిస్తాడు. దగ్గరగా ఉంటూనే వాళ్లు దూరం పెంచుకున్నారు. ప్రతి క్షణమూ నిశ్శబ్దంతో నింపి, అపరిచితులుగా విడిపోయారు

సరస్వతి తరచుగా రామంతో మాట్లాడుతుంది. అవసరం అనుకున్న అన్ని విషయాల్లో అతని సాయం కోరుతుంది. ఎవరితో ఎలాంటి బంధం ఎప్పుడు ఎలా ఏర్పడుతుందో గాని– కొందరి మనసు నొప్పించడానికి ఏమనిషీ యిష్టపడడు. మొహమాటమో, ఏదో అవస్థో మనిషిని ఓ యిరుసులో పెట్టి బంధిస్తుంది. రామం–సరస్వతి మాటను ఎప్పుడూ నిరాకరించలేదు.

మే నెల చివరి వారంలో రజనీ పరీక్షలు పూర్తయ్యాయి.

సెలవులకి యింటికి వెళ్లి, అమ్మానాన్నలతో గడిపి వస్తానని చెప్పి, రజనీ ఊరు వెళ్లిపోయింది. సరస్వతి స్కూల్లో పిల్లల పరీక్షలు పూర్తి కాలేదు. పైగా ఆమెకి స్పాట్ వాల్యూయేషన్ డ్యూటీ వేశారు. ఊరు వెళ్లాలని మనసులోఉన్నప్పటికి, తన ప్రయాణం మానుకుంది.

పది రోజులు గడిచిపోయాయి.

స్కూలుకి వేసవి సెలవు లిచ్చారు. పరీక్ష పేపర్లు దిద్దడం పూర్తి కావడంతో సరస్వతికి పూర్తిగా తీరిక ఏర్పడింది. సహాధ్యాయులు చాలా మంది ఊళ్లు వెళ్లిపోయారు. తెలిసినవాళ్లు ఎక్కువగా లేకపోవడం చేత ఎవరింటికీ వెళ్లడం

లేదు. ఇంట్లోనే ఇరవై నాలుగ్గంటలూ కూర్చొని పుస్తకాలతో, అల్లికలతో కాలక్షేపం చేస్తుంది.

ఒక రోజు ఉదయం ప్రక్కవాటాలో నుండి మూలుగులు వినిపించేసరికి, సరస్వతి రామం గదిలోకి వెళ్లింది. రామం చలిజ్వరంతో వణికిపోతున్నాడు. రెండు, మూడు దుప్పట్లు కప్పినా, విపరీతంగా ఉంగలు చుట్టుకుపోతున్నాడు.


సరస్వతి స్వయంగా వెళ్లి డాక్టరుని తీసుకొచ్చింది. డాక్టరు పరీక్ష చేసి, రామంకి 'ఫ్లూ' అని తేల్చాడు. అతను జ్వరం తగ్గేవరకు మంచం కదలకూడదని యింజక్షన్ చేసి వెళ్లిపోయాడు. సరస్వతి_రామంచేత వారం రోజులు సెలవు పెట్టించింది. మార్కెటుకి వెళ్లి కావలసిన మందులూ టానిక్కులూ కొని తీసుకొచ్చింది.

రెండు వాటాలకి మధ్య వున్న తలుపులు తెరుచుకున్నాయి. గుమ్మం చుట్టి తిరిగి రావాలంటే యిబ్బంది, చికాకుగా ఉంటుంది. ప్రస్తుతం-తలుపులుతెరవడం చేత టైంకి రామానికి మందులూ, పళ్లరసం యివ్వటానికి వీలుగా ఉంటుంది. ప్రతి క్షణమూ అతని పరిస్థితిని గమనించటానికి తేలిగ్గా ఉంటుంది. నాలుగు లంఖణాలు చేస్తేగాని రామానికి పథ్యం పెట్టడానికి వీలుపడలేదు.

సరస్వతి చేసిన సపర్యలకి అతను తొందరగా కోలుకున్నాడు.

"సరస్వతిగారూ! మీకు ఎలా థ్యాంక్స్ చెప్పుకోవాలో తెలియటంలేదు. మీరు చూడకపోతే, బహుశా 'నేను' అనే వాడు ఈ ప్రపంచం నుండి తప్పుకొనేవాడేమో?" రామం కళ్లు కృతజ్ఞతతో మిలమిల మెరిశాయి. తనకళ్ళలో ఆమె చేసిన ప్రతి సేవా యింకా కనిపిస్తూనే ఉంది.

"రామంగారూ! అంత మాట అనకండి. మీరు మా కోసం ఎన్ని చేయడం




లేదూ? మనిషికి మనిషి సాయం అవసరం. అంతే!" సరస్వతి చాలా సాఫీగా అంది. అతను వేరు అనుకోవడం లేదు. యింట్లో అందరితో బాటు ఒకరు అనుకుంటుంది.

ప్రతి రోజూ ఏదో సమయంలో యిద్దరూ ఏవో విషయాలు మాట్లాడుకుంటున్నారు. ఇదివరకటిలా కాకుండా ఎలాంటి అరమరికలు లేకుండా స్వేచ్ఛగా కలిసిపోయారు.

* * *

మూడు రోజుల్నుంచి కుండపోతగా భోరున వర్షం కురుస్తుంది. ఈదురు గాలులకి పెరట్లో చెట్లు ఊగిపోతున్నాయి. బొత్తిగా వెలుగు రావడంలేదు. ఎప్పుడూ ఆకాశం మబ్బులతో నల్లగా కనిపిస్తుంది.

ఆఫీసు నుండి ఇల్లు చేరేసరికి రామం తడిసి, ముద్దయిపోయాడు.

సరస్వతి మధ్య తలుపులు తెరిచేసరికి రామం బట్టలు మార్చుకొని, తువ్వాలుతో నీళ్లు కారుతున్న తలను రుద్దుకుంటున్నాడు.

"ఏమిటండీ? వర్షం వెలిసే దాకా ఆఫీసులో ఉండలేకపోయారా? జ్వరం పడి లేచారు. తడిస్తే మళ్లీ తిరగబెట్టదూ?" సరస్వతి కంగారుపడింది.

"మీరున్నారు కదండీ జ్వరం పడినా, జబ్బుపడినా నన్ను కాపాడానికి. అయినా మూడు రోజుల్నుంచి ఏకధాటిగా కురుస్తున్న ఈ వర్షం ఈ రోజు అమాంతం తగ్గిపోతుందని ఎలా అనుకుంటారు?" ఆమె కంగారు చూసి రామం గల గల నవ్వేశాడు.

ఆమె తువ్వాలు లాక్కొని, అతన్ని దగ్గరగా తీసుకొని గబగబా తల తుడిచింది. ఒక్క క్షణం ఆమె ఒళ్లు ఝల్లుమంది. వారం రోజులు అతని కెన్నో సపర్యలు చేసింది. అతన్ని లేవదీసి, మందులు పట్టింది. స్నానానికి నీళ్లు తోడింది. అన్నం వండి పెట్టింది. మంచమ్మీద నిద్ర పుచ్చింది. ఇంకా ఎన్నో చేసింది. ఏ క్షణంలోనూ ఆమె గగుర్పాటు చెందలేదు. ఏమీ ఆలోచించలేదు.

మొదటిసారి తన మనసు అదుపు తప్పింది. ఎక్కడో ఏదో ఆలోచిస్తుంది.

గదిలో పరుచుకున్న విద్యుత్తు కాంతిలో అతని శరీరం దబ్బపండులా మెరిసిపోతుంది. ఉంగరాల జుత్తు అల్లిబిల్లిగా ముద్దగా ముద్దుగా కనిపిస్తుంది. విశాలమైన వీపుమీద ముత్యాల్లాంటి నీటి బిందువులు అక్కడక్కడ జారుతున్నాయి. అతని కనుపాపల్లో ఆమె రూపం రెపరెప లాడుతుంది.

భావాని కతీతమైన అనుభూతి ఏదో ఆమె గుండెను బరువుచేసింది. తువ్వాలు



అతని చేతిలో విడిచిపెట్టి, తన గదిలోకి వెళ్లిపోయి, తలుపులురెండూ మూసింది. మంచమ్మీద బరువుగా వాలిపోయింది.

సరస్వతి—రజనీ కన్న మూడేళ్లు పెద్ద. ఆమె మెళ్లో మూడు ముళ్లూ వేసిన మూడో రోజున కట్టుకున్నావాడు, కడ దాకా ఉండవలసిన వాడు కారు ప్రమాదంలో కన్ను మూశాడు. శోభనం జరగవలసిన రోజున అతనికి అంత్య క్రియలు జరిగిపోయాయి. ఆమె దురదృష్టం నుదుట కుంకుమను నిర్దాక్షిణ్యంగా చెరిపివేసింది. లోకులు కాకుల్లా ఆమెను నానామాటలతో పొడిచారు. ఆమె అడుగుపెడుతూనే అతని జీవితాన్ని ఆర్పివేసిందని దుర్భాషలతో ఆమెనుపిచ్చిదాన్ని చేశారు. అక్కడ ఆ మనుషుల మధ్య ఉండలేక దూరంగా పారిపోవాలనిపించింది. ఉన్న ఉద్యోగాన్ని బదిలీచేయించుకొని ఉన్న ఊరికి, అయినవాళ్లకి దూరంగా వచ్చేసింది. అన్నయ్యా వదినా తనకి తోడుగా రజనీని పంపించారు. జీవితాంతం అత్తయ్యతో ఉండమని రజనీకి నచ్చ జెప్పారు.

సరస్వతి తన దగ్గరున్న డబ్బుతో ఓ చిన్న యిల్లు కొంది. జీవితం సాఫీగానే సాగిపోతుంది. జీవితంలో మధురిమ కరువైపోయింది. ఎలాంటి ముచ్చట్లూ అచ్చట్లూ తీరకుండానే ఆమె బ్రతుకులో ముసలితనం వచ్చేసింది. వయస్సులో ఉండే ఆడపిల్ల మాదిరి ఆమె ఎప్పుడూ ఆలోచించలేదు. తనకి అన్నీ గడిచి పోయాయన్న భ్రమలోనే కొట్టుకు పోతుంది. ఇప్పటివరకు ఆమె మనసులో ఎవరికీ చోటు యివ్వలేదు. ఇవ్వాలనిగాని యివ్వవలసి వస్తుందని గాని ఊహించలేదు.

కానీ, ఈ రోజు రామం గురించి ఎందుకు ఆలోచిస్తున్నట్లు! సంకెళ్లు వేసి చీకటిలో బంధించిన మనసు ఎదురు

తిరుగుతుంది. తనలో యవ్వనమూ వయస్సూ, కోరికా, ఒకటేమిటి అన్నీ కలగాపులగంగా తన గుండెల్లో పేరుకు పోతున్నాయి. బాధ పెడుతున్నాయి. మతి చలింపజేస్తున్నాయి.

జీవితంలో ప్రతివ్యక్తీ ఏదో ఒకసారి యిలాంటి అవస్థకి గురికావలసిందేమో? అప్పుడు రజనీని మందలించినప్పుడు తన హృదయం కూడా ఏదోరోజున ప్రేమను కోరుతుందని ఊహించలేదు. రామాన్ని హెచ్చరించినప్పుడు తనూ మనిషిగా ఏదో సందర్భంలో బలహీనతకి లొంగిపోతుందని ఆలోచించలేదు.

భోజనం చేయాలనిపించలేదు. గదిలో దీపం వెలుగుతుంది. ఆలోచనలు కట్టిపెట్టి, నిద్రపోవాలని ప్రయత్నం చేసింది సరస్వతి.

బయట యింకా వర్షం కురుస్తుంది. అప్పుడప్పుడు ఆకాశంలో ఉరుములకి మెరుపులకి ప్రకృతి హోరుమంటుంది. మెరుపుల వెలుగులో బయట దయ్యం పట్టినట్లు ఊగిపోతున్న చెట్లు కనిపిస్తున్నాయి. ఉరుములకు వాతావరణమంతా కళపెళ మంటుంది.

నెమ్మదిగా సరస్వతి మంచమ్మీద నుండి లేచి కిటికీ రెక్కలు మూసింది. మనసుని ఆలోచనల నుండి మరోవేపుకి మళ్ళించటానికి పెట్లో పురాణ పుస్తకం తీసింది.

పుస్తకం పేజీలు తెరుస్తున్నప్పుడు, అందులో ఉన్న ఒక ఉత్తరం కింద పడింది. అది చివరిసారిగా రామం రజనీకి రాసి, రజనీని తీసుకోమని బావి గట్టుమీద ఉంచాడు. దూరంగా పెరటి వేప ఉన్న కిటికీలో నుండి చూస్తున్న సరస్వతికి ఆ దృశ్యం కంట పడింది. సరస్వతి చరచరా బయటకు వచ్చి, రజనీ చేతిలో ఉత్తరం లాక్కుంది. ఆ ఉత్తరమే యిప్పుడు బయటపడింది. ఆ రోజు చదవలేదు. ఈ రోజు చదవాలనే కుతూహలం ఎక్కువౌతుంది. ఎంత నిగ్రహించుకున్నప్పటికీ ఆమె ప్రమేయం లేకుండా ఆమె చేతులు ఉత్తరం మడతలు విప్పాయి.

"హల్లో రజనీ,

పక్కింటి అమ్మాయి గడుసమ్మాయి కదూ? అదిగో నవ్వకు. అలా నువ్వు గలగల నవ్వుతుంటే ఎన్ని ముత్యాలు కిందికి జారిపోతున్నాయో? నా రెండు దోసిళ్లూ చాలవు.

రాత్రి నాకు కలొచ్చింది. మనకి పెళ్లయిందట. శోభనం అట. వెన్నెల, మల్లెపూలు, పాలమీగడ, తెల్లటి పాన్పు వాటిని చూసి, మనం పులకించిపోయి, తెల్లవార్లూ, యిద్దరమూ ఒకే దుప్పట్లో చోటుచేసుకొని ఆ తర్వాత.... సరస్వతి మరి చదవలేకపోయింది. మధ్యలో మడిచివేసింది. భరించలేని తాపం, ఒంట్లో విద్యుత్తు ప్రవహిస్తుంది. నరాల్లో వణుకు మొదలయ్యింది.

మధ్యగది తలుపులు బార్లా తెరిచింది. ఎదురుగా మంచమీద కూర్చొని బెడ్ లైటు వెలుగులో నవల చదువుకుంటున్న రామం ఆశ్చర్యపోయాడు. ఆమె కళ్లలో నీటిపొరలు, ఆ పొరల వెనుక బలీయమైన కాంక్ష ఆమె నీ తెగింపుకి తీసుకొచ్చాయి.

సరస్వతి వడివడిగా వెళ్లి, రామం గుండెలమీద వాలిపోయింది. అచేతనంగా రామం చేతులు ఆమెను దగ్గరగా తీసుకున్నాయి.

* * *

బాగా పొద్దుపోయింది.

రజనీ యింటి ముందు రిక్షా దిగేసరికి ఐదుగంటలు దాటింది. పెట్టె పట్టుకుని గుమ్మంలో అడుగుపెట్టిన రజనీ ఆ దృశ్యం చూసి శిలాప్రతిమలా అక్కడే అలాగే నిలబడిపోయింది.

మధ్యగది తలుపులు పూర్తిగా తెరుచుకున్నాయి.

రజనీ వాళ్ల వాటాలో అత్తయ్యా, అతనూ దగ్గరదగ్గరగా కూర్చున్నారు. అతని చేత అత్తయ్యా కొసరి కొసరి తినిపిస్తుంది. అతనికి దగ్గరగా ముడుకుల మీద తలపెట్టుకొని, అతని కళ్ళలోకి చూస్తూ నేలమీద గిరులు గీస్తుంది. దీపం వెలుగులో వాళ్లిద్దరి క్రీనీడలు ఒకటిగా కలిసిపోయి కనిపిస్తున్నాయి.

ఒకప్పుడు సరిగ్గా తనకీ రామంకీ మధ్యగడిచిన క్షణాల్లాగే అత్తయ్య చిలిపిగా అతని చుబుకం కాస్త ఎత్తి మెల్లిగా గిల్లింది, అతను అత్తయ్యను దగ్గరగా తీసుకొని, కంచంలో కలిపిన అన్నం తీసి, అత్తయ్య నోటికందించాడు.

వాళ్లిద్దరూ రజనీని చూసి తుళ్లిపడ్డారు.

రజనీ మాట్లాడలేదు. వెనక్కి తిరిగింది. ఆ గుమ్మం దాటి వచ్చిన దోవనే పట్టుకుంది. అత్తయ్యకి తోడు దొరికింది అని గొణుక్కుంటూ ముందుకి నడుస్తుంటే తన కళ్ళ ముందు అంతా శూన్యంగా కనిపించింది.

ఆమె దూరంగా చీకటిలో నీడలో కలిసిపోతుంటే రామం, సరస్వతి ఒకరొకరు చూసుకొని, సిగ్గుపడి తలలు వంచుకున్నారు.